

బ్యాంక్ కాలనీలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



పంచశీల కాలనీలోని శ్రీలలితా పరమేశ్వరి ఆలయ పూజలో భక్తులు



చింతల్ బాల్‌రెడ్డినగర్‌లోని సాయిబాబా ఆలయంలో..



నిజాంపేట్ రాజీవ్‌గృహకల్పలో పూజల్లో పాల్గొన్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం గురుపౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా పలువురు తమ గురువులకు పాదాభివందనం చేసి తమ కృతజ్ఞతను తెలియజేశారు. తొలి గురువైన వ్యాస మహర్షి జయంతిని పురస్కరించుకుని గురు పౌర్ణమిని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.

– రంగారెడ్డినగర్



బాచుపల్లి కేఆర్‌సీఆర్ కాలనీలోని ఆలయంలో పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ప్రగతినగర్ సెక్షన్ ఏఈ సమ్మయ్య ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం, 11 కేవీ కోకాకోలా ఫీడర్ల పరిధిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంబిటాస్ స్కూల్, డాలర్ మీడోస్, అమర దాబా, బావర్చి హోటల్, ఎస్‌బీఐ కాలనీ, సింహపురి కాలనీ, నెక్స్ట్ విల్లాస్, గోకుల్ విల్లాస్, లహరి ఎస్టేట్, విజ్ఞాన జ్యోతి హాస్టల్, క్రీక్ స్కూల్ ఏరియా, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం బౌరంపేట్, జగన్ స్టూడియోస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీనల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడలోని శ్రీనల్లగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రతినెలా పౌర్ణమి రోజు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష అభిషేకాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కరోనా లక్షణాలు ఉంటే కోవిడ్ పరీక్షలు చేయించుకోవాలి

రంగారెడ్డినగర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 17 మందికి కోవిడ్ పరీక్షలు నిర్వహించగా అందరికి నెగిటీవ్ రిపోర్టులు వచ్చాయని మండల వైద్యాధికారి డాక్టర్ నిర్మల తెలిపారు. ప్రస్తుతం వాతావరణం చల్లబడటంతో పాటు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారముందని, ఎవరైనా తీవ్రజ్వరం, దగ్గు, జలుబు, ఒంటి నొప్పి తదితర లక్షణాలతో బాధ పడుతుంతే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకోవాలని నిర్మల సూచించారు.

బీసీ ముఖ్యమంత్రి సాధన కోసం ఐక్య కార్యాచరణ

లాలాపేట: వచ్చే ఎన్నికల్లో బీసీని ముఖ్యమంత్రి చేయడానికి ఐక్య కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు సదరన్ పొలిటికల్ అకాడమీ అధ్యక్షులు ప్రొ.గాలి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలోని అన్ని రాజకీయ పార్టీలు మెజార్టీ కులాలకు చెందిన బీసీని సీఎం అభ్యర్థిగా ప్రకటించకుండా కేవలం బీసీ డిక్లరేషన్ పేరుతో మోసం చేస్తున్నాయన్నారు. ప్రజాస్వామ్యం అంటే మెజార్టీ రూలింగ్ అని తెలంగాణలో మైనార్టీ కులమే పాలన చేస్తుందని ఈ పరిస్థితి మారాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. సెప్టెంబర్ 19న వరంగల్‌లో బీసీ సీఎం సాధన సదస్సు ఉంటుందని తెలిపారు.

సంతలు, దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలి

సుభాష్‌నగర్: వారంతాపు సంతలు, దేవాలయాల్లో ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని సామాజిక కార్యకర్త కోలా రవీందర్ ముదిరాజ్ సోమవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమతను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోనాల సందర్భంగా ఆలయాలకు మొక్కులు తీర్చుకునే భక్తులు ప్లాస్టిక్ కవర్లను తీసుకు వస్తారని, దీంతో ప్లాస్టిక్ వ్యర్థాలు పెద్ద మొత్తంలో పోగువుతన్నాయని అన్నారు. ఆలయాలకు బోనాల చెక్కులు ఇచ్చే సందర్భంలో ఈ విషయమై ఆలయ కమిటీలకు, పూజారులకు అవగాహన కల్పించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని నోటీసులు జారీ చేయాలని ఆయన కోరగా జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారు.

సిబ్బంది లేక.. పనులు సాగక.!

- తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత
- ఖాళీలను భర్తీ చేయని వైనం
- పని భారంతో ఇబ్బందులు ఉన్న ఉద్యోగులు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయం

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో కొంతకాలంగా పోస్టులు ఖాళీ ఉండడంతో పని భారం మరికొందరిపై పడింది. నగరంలో అసలే అత్యధిక జనాభా కలిగిన కుత్బుల్లాపూర్. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి నిత్యం మందుల సంఖ్యలో వస్తుంటారు. జనాభాకు అనుగుణంగా సిబ్బంది లేకపోవడంతో పనులు త్వరగా కాక ఆలస్యంగా అవ్వడమే కాకుండా పని భారం మరికొంతమందిపై పడింది. రెండు సంవత్సరాల నుంచి సీనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీ ఉంది. దీనికి తోడు ఇటీవల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సస్పెండ్ కావడంతో ఆ సీటు కూడా ఖాళీగానే ఉంది. కార్యాలయంలో 10మంది వీఆర్‌ఏలకు గాను 6మంది ఉన్నారు. ప్రస్తుతం వారు కూడా డబుల్ బెడ్ రూమ్ ఎంక్వైరీ పనిలో నిమగ్నమయ్యారు. దీంతో కార్యాలయానికి వచ్చేవారికి సకాలంలో పనులు చేరక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఒక్కరికి ఐదు బాధ్యతలు....

పేట్‌బషీరాబాద్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే రేణుక ప్రస్తుతం ఐదు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. గాజులరామారం సెక్షన్ సంబంధించిన ఆర్‌ఐ సస్పెండ్ ఇన్‌చార్జ్ ఆర్‌ఐగా, ఎన్నికల సూపర్‌వైజర్, గతంలో 59 జీవో కింద అర్హులైన వారికి సీనియర్ అసిస్టెంట్‌గా రిజిస్ట్రేషన్ చేసేందుకు, ఇటీవల 59 జీవో కింద దరఖాస్తు పెట్టుకున్న దరఖాస్తుల ఎంక్వైరీ, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా చూసుకోవడంతో పాటు కోర్టు ఇతర పనులు నిర్వర్తిస్తున్నారు.

సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులకు తెలిపాం..

కార్యాలయంలోని సిబ్బంది కొరతపై ఉన్నతాధికారులపై అధికారుల దృష్టికి తీసుకెళ్లామని... వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే వారి పనులను అయినంత వరకు త్వరగా చేసి పంపిస్తున్నామని తహసీల్దార్ సంజీవరావు పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలే మళ్లీ అధికారంలోకి తీసుకొస్తాయి

• కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

రంగారెడ్డినగర్: ప్రభుత్వ పథకాలే బీఆర్‌ఎస్‌ను మరోసారి అధికారంలోకి తీసుకొస్తాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ న్యూవివేకానంద కాలనీకి చెందిన కేమ శ్రీనివాస్ మిత్ర బృందం సోమవారం చింతల్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించి అనంతరం ఎమ్మెల్యే వివేకానంద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సారథ్యంలో కొనసాగుతున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారని అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుతంత్రాలు చేసినా బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు.

◆ వరల్డ్ మెకానిక్ డేను పురస్కరించుకొని సుచిత్ర – కొంపల్లికి చెందిన మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించారు. యూనియన్ ప్రెసిడెంట్ పాండు, కిరణ్, రామ్మోహన్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు

శ్రీహరిరాజుకు మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ రెవెన్యూ అధికారిగా పని చేస్తున్న శ్రీహరిరాజుకు మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. ఆయనను అచ్చంపేట్ మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమలులోకి వస్తాయని ఉత్తర్వుల కాపీలో పేర్కొన్నారు. కాగా అచ్చంపేట్ మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న బలరామ నాయక్‌ను మత్కల్ మున్సిపల్ కార్యాలయానికి బదిలీ చేయగా ఆయన స్థానంలో శ్రీహరిరాజు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ అవసరం

ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్సలర్ ప్రొ.సులేమాన్ సిద్ధిక్

రాయదుర్గం: ఉపాధ్యాయులకు శిక్షణ ఎంతో అవసరమని ఉస్మానియా విశ్వవిద్యాలయం మాజీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సులేమాన్ సిద్ధిక్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో సోమవారం ఫ్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రామ్(ఎఫ్‌ఐపీ) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపక వృత్తిలో విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులను వెంటనే తరగతి గదులకు పంపుతారని, అందువల్ల వారికి విద్యాసంస్థలు, తరగతి గదులలో బోధన కోసం ప్రత్యేక శిక్షణ ఇవ్వడం చాలా అవసరమన్నారు. అంతకుముందు యూజీసీహెచ్‌ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్‌ఫాతిమా, పలువురు ప్రొఫెసర్లు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు నెపంతో తరచూ విద్యుత్ కోతలు



గురుమూర్తినగర్ కమ్యూనిటీహాల్ సమీపంలో విద్యుత్ వైర్లకు అల్లుకున్న తీగలు

రంగారెడ్డినగర్: విద్యుత్ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు, అల్లుకున్న తీగలను తొలగించే నెపంతో విద్యుత్ శాఖ అధికారులు తరచూ కోతలు విధిస్తున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. విద్యుత్ శాఖ సిబ్బంది తూతూ మంత్రం పని చేస్తున్నారనడానికి రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గురుమూర్తినగర్ కమిటీ హాలు సమీపంలో విద్యుత్ వైర్లకు అల్లుకున్న తీగలనే పేర్కొనవచ్చు. ప్రధాన లైన్‌కు తీగలు అల్లుకోవడంతో ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడిన ప్రతిసారి ట్రిప్ అయి విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని ఈ విషయమై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సమీప ఇళ్ల వాసులు కోరుతున్నారు.

రసాయనాలు వెదజల్లే పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలి



చేపలను పరిశీలిస్తున్న ఎస్.మల్లారెడ్డి

దుండిగల్: ఫార్మ పరిశ్రమలు వెదజల్లే వ్యర్థ రసాయనాల కారణంగా చెరువులోని చేపలు మృత్యువాత పడుతున్నాయని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లారెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లాపూర్‌లోని కోతినార్ చెరువును సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న పరిశ్రమలు రసాయనాలను చెరువులోకి వదలడం కారణంగా రూ.10 లక్షల విలువ చేసే చేపలు మరణించాయని అన్నారు. వాటినే నమ్ముకుని జీవనోపాధి పొందుతున్న ముదిరాజ్ కులస్తులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రెవెన్యూ, ఇరిగేషన్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సదరు పరిశ్రమలపై వెంటనే చర్యలు తీసుకుని బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పరిశ్రమల ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు మల్లేష్, కృష్ణారెడ్డి, విజయ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మోర శంకర్, ఫిషరీస్ సంఘం సభ్యులు మోర చిన్న ఉన్నారు.

ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి



గ్రీవియన్స్ మోడల్‌పై అవగాహన కల్పిస్తున్న ఉప కమిషనర్ ప్రశాంతి

రంగారెడ్డినగర్: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ ప్రశాంతి అన్నారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో గ్రీవియన్స్ మోడల్‌పై సర్కిల్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏదైనా ఫిర్యాదు ఆన్‌లైన్‌లో అందితే దాన్ని సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం.. సదరు సమస్యను పరిష్కరించిన అనంతరం కంప్లెయింట్‌ను ఎలా క్లోజ్ చేయాలి.. తమ పరిధిలోనిది కాకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సంబంధిత శాఖ అధికారులకు ఎలా ఫిర్యాదును చేరవేయాలన్న విషయాలపై అవగాహన కల్పించారు. ఈ అవగాహన సమావేశంలో ఫీల్డ్ ఆఫీసర్లు, ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

‘పనులు పూర్తయినా వ్యర్థాలు తొలగించరు’



పంచశీలకాలనీ రోడ్ నం.14కు అడ్డుగా వేసిన కాంక్రీట్, మట్టి వ్యర్థాలు



పంచశీలకాలనీ రోడ్ నం.7లో కుప్పలుగా వేసిన కాంక్రీట్ దిమ్మెలు

రంగారెడ్డినగర్: అభివృద్ధి పనులు ప్రజలకు కొత్త కష్టాలు తెచ్చి పెడుతున్నాయి.. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పంచశీలకాలనీ లైన్–2లో ఇటీవల సర్కిల్ నిధులతో సీసీరోడ్డు పనులు పూర్తి చేశారు. అయితే పనుల సమయంలో వెలువడిన కాంక్రీట్, మట్టి వ్యర్థాలను సంబంధిత కాంట్రాక్టర్ తరలించకుండా అంతర్గత రోడ్లపై వేసి చేతులు దులుపుకున్నాడు. పంచశీల కాలనీలోని రోడ్డు నం.14, రోడ్డు నం.7, ఇతర అంతర్గత రోడ్లపై కాంక్రీట్ వ్యర్థాలు, రాళ్లను వేయడంతో రాకపోకలకు ఆటకంగా మారుతోంది. ముఖ్యంగా కార్లు, ఆటోలు వంటి వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా రోడ్లు మారాయి. దీంతో చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్ రోడ్లపై వేసిన కాంక్రీట్, మట్టి వ్యర్థాలను తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పంచశీల కాలనీవాసులు కోరుతున్నారు.

మూణ్నాళ్లకే శిథిలావస్థకు..

- అధికారుల పర్యవేక్షణ కరువు
- నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టరు

చింతల్: పైన పటారం లోన లొటారం అన్న చందంగా మారింది వాటర్ వర్క్స్ అధికారులు పనితీరు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా ప్రభుత్వం నిధ్ర నుంచి చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు తూతూమంత్రంగా పూర్తవుతున్నాయి. అక్కడ దగ్గర ఉండి పనులు పర్యవేక్షించాల్సిన స్థానిక సెక్షన్ మేనేజర్లు కేవలం కార్యాలయాలకు పరిమితం అవుతున్నారన్న ఆరోపణలు ఇందుకు నిదర్శనంగా మారుతున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించిన ఈ భూగర్భ డ్రైనేజీ పైపులైన్లు మూణ్నాళ్లకే శిథిలావస్థకు చేరే ప్రమాదం పొంచి ఉంది.

పాత మ్యాన్‌హోళ్లకే పైపులైన్ కనెక్షన్లు

కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ గాజులరామారం డివిజన్ పరిధిలోని రోడా మేస్త్రినగర్–బీలో మౌలాలి అలీ చిల్లా రోడ్డులో ఇటీవల జలమండలి అధికారులు రూ. 35 లక్షలతో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ వేశారు. పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ రోబోసాండ్ పౌడర్ వాడకంతో పాటు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పైపులైన్ పనులు పూర్తి చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పాత వాటికే మూతల ఏర్పాటు

అదే విధంగా నూతన పైపులైన్ వేసే మార్గంలో పాత పైపులైన్‌ను తొలగించిన అనంతరం కొత్త గుమ్మీలు ఏర్పాటు చేసి అనంతరం మాన్‌హోళ్లకు మూతలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ సుమారు 50 వరకు మ్యాన్‌హోళ్లకే నూతన పైపులైన్లను కలవడంతో ఇది ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇదే పాత మ్యాన్‌హోళ్లపైనే మూతలను ఏర్పాటు చేయడం అక్కడి పనితీరుకు నిదర్శనంగా మారింది.

స్థానికుల అభ్యంతరాలు పట్టించుకోని జలమండలి..

కాంట్రాక్టర్ పాత మ్యాన్‌హోళ్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయకుండా పాత వాటిని కొనసాగించడంపై అక్కడి మహిళా సంఘాల నేతలు, అదే విధంగా స్థానికులు జలమండలి అధికారులను తీరును ఎండగట్టిన సదరు కాంట్రాక్టర్ అదే రకంగా పనులు చేపట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎంత చిన్న నూతన పైపులైన్ వేసినా కొత్త కొమ్ములను నిర్మించే కాంట్రాక్టర్లు ఇక్కడ ఎందుకు పాతవి ఉపయోగించాల్సి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. పాత మ్యాన్‌హోళ్లతోనే పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించే విషయంలో అధికారులు ఏ విధంగా చర్యలు చేపడతారో వేచి చూడాల్సిందే.





రోడామేస్త్రీనగర్–బీలో పాత మ్యాన్‌హోళ్లకే పైపులైన్ కనెక్షన్లు



డ్రైనేజీ పనుల్లో ఉపయోగించిన నాసిరకం సామగ్రి..

నాసిరకం పనులపై చర్యలు తప్పవు..



రోడామేస్త్రీనగర్–బీలో భూగర్భ డ్రైనేజీ పనుల్లో చోటు చేసుకున్న అవకతవకలపై మాకు ఫిర్యాదులు అందాయి. జలమండలి అధికారులతో క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేపట్టి సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం. నాసిరకంగా పనులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం.

– శ్రీధర్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం